
నందిగామలో గణనాథుని పూజలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఇతర నాయకులు

గంగమ్మ ఒడికి గణపయ్య చేరేదెలా?

జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసినప్పటికీ యాచారం మండలంలో మోస్తరుగా పడటంతో వివిధ గ్రామాల లోని చెరువులు, కుంటల్లో చుక్కనీరు చేరలేదు. తాటిపర్తి బంధం, చింతపట్ల లక్ష్మణ్ చెరువుల్లో కొద్దిపాటి నీరు మాత్రమే ఉంది. మండలంలో ఉన్న 116 చెరువులు, కుంటలున్నాయి. రెండు మినహా మిగిలిన వాటిల్లో నీరు లేకపోవడంతో గణపయ్యల నిమజ్జనానికి కష్టాలు తప్పేలా లేదు. గణనాథులను ఎక్కడ నిమజ్జనం చేయాలా అని నిర్వాహకులు మదన పడుతున్నారు. చింతపట్ల లక్ష్మణ్ చెరువులో నీరు తక్కువగా ఉండటంతో అందులో వినాయక విగ్రహాలు వేయకుండా అక్కడ పోలీసులను ఉంచారు. అలాగే తాటిపర్తి చెరువులో నిమజ్జనం చేయడానికి వీలు లేకుండా టీజీఐఐసీ అధికారులు ఫెన్సింగ్ బిగించారు.

యాచారం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి)


యాచారం : అడుగంటిన తాటిపర్తి బంధం చెరువు

ఘనంగా గణనాథులకు పూజలు

జిల్లావ్యాప్తంగా వినాయక చవితి ఉత్స వాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం నందిగామ మండలంలోని అన్ని గ్రామాల్లోని గణపతి మండపాలలో పూజలు నిర్వహించారు. నందిగామ మండలకేంద్రంలోని ఏర్పాటు చేసిన గణనాథుడికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చేవెళ్ల మండల పరిధి లోని ముడిమ్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలం నిర్వహించారు. ఈ లడ్డూను బీఆర్‌ఎస్ నాయకుడు గోనె మాధవరెడ్డి రూ.18లక్షలకు దక్కించుకున్నాడు.

నందిగామ/చేవెళ్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి)


ముడిమ్యాల గ్రామంలో లడ్డూను దక్కించుకున్న మాధవరెడ్డి


హైటెక్స్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, కలెక్టర్ నారాయణరెడ్డి

గ్రామ పాలన అధికారులకు నియామక పత్రాలు

- నేడు హైటెక్స్‌లో అందజేయనున్న సీఎం రేవంత్
- ఏర్పాట్లను పరిశీలించిన రెవెన్యూశాఖ కార్యదర్శి, కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గతంలో వీఆర్వో లుగా పని చేసిన వారికి నేడు (శుక్రవారం) సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పాలన అధికారులుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. ఇందుకు సంబంధించి గచ్చిబౌలిలోని హైటెక్స్‌లో ఏర్పాట్లను గురువారం రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, కలెక్టర్ సి.నారాయణరెడ్డి పరిశీ లించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లలో ఎలాంటి పొర పాట్లు జరగకుండా చూడాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, మాదాపూర్ డీసీపీ వినతి, సీసీఎల్ఏ కమిషనర్ మకరందం, అధికారులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాటం స్వరూప

రాజీమార్గమే రాజమార్గం

- జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప

ఆమనగల్లు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజీమార్గమే రాజమార్గ మని, కేసులను సత్వరమే పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్‌అదాల త్‌లు దోహద పడుతాయని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. ఆమనగల్లు కోర్టు ఆవరణలో ఈనెల 13న నిర్వ హించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంపై గురువారం పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరా లను ఆమె అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీపీ కార్తీక్, సీఐలు జానకిరామ్ రెడ్డి, గంగాధర్, ఆమనగల్లు , కడ్తాల, తలకొండపల్లి ఎస్ ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, సీతారామ్ రెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.

విషమ కాలం!

- జిల్లాలో ఏటేటా పెరుగుతున్న పాము కాటు కేసులు
- బాధితుల్లో అత్యధికులు రైతులు, వ్యవసాయ కూలీలే..
- అప్రమత్తంగా లేకుంటే ప్రాణాలకే ప్రమాదం

పల్లెల్లో పెరిగిన సర్పాల సంచారం

పాము కాటేసింది



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఎం.కృష్ణ, అతని ఊరు మన్నెగూడ, చేవెళ్ల మండలం ముడిమ్యాలలోని ఓ ఫాంహౌస్‌లో పనిచేస్తు న్నాడు. రోజువారీ పనిలో భాగంగా పాత పైపు లను మోసుకుంటూ బయట పెడుతున్న క్రమంలో పాము (కట్ల పింజర) భుజంపై కాటేసింది. వెంటనే పామును చంపేశాడు. చచ్చిన పామును కవర్‌లో వేసుకుని వెంటనే చేవెళ్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. ఆ పామును గుర్తించి యాంటీ స్నేక్ వీనమ్(ఏఎస్‌వీ) ఇంజక్షన్ ఇచ్చారు. 24 గంటలు అబ్జర్వేష న్‌లో ఉంచుకుని తర్వాత అతన్ని డిశ్చార్జ్ చేసి పంపించారు.



జిల్లాలో జోరుగా వానలు కురుస్తున్నాయి. ఇప్పటి వరకు భూమిలో ఉన్న వేడి ఆవిరి రూపంలో బయటకు వస్తోంది. ఈ సమయంలో విషసర్పాల సంచారం ఎక్కువగా ఉంటుంది. గమనించక వాటి సమీపంలోకి వెళ్లినప్పుడు పాము కాటు గుర వుతుంటారు. ప్రమాదాన్ని సకాలంలో గుర్తించక.. వైద్యం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ ఘట నలు జరుగుతున్నాయి. ఆసు పత్రుల్లో యాంటీ స్నేక్ వీనమ్ (ఏఎ్ ఎవీ) ఇంజక్షన్లు అందుబాటులో ఉంటున్నా క్షేత్రస్థాయిలో వాటిని విని యోగించడంలో సిబ్బందికి సరైన అవగాహన లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాముకాటు కేసులు రోజురోజుకూ పెరుగుతు న్నాయి. వానాకాలంలో విష సర్పాల విషయంలో అప్ర మత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. పాము కాటు వేసినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పాము కాటు వేసి ప్రదేశంలో రెండు కోరల గాయం స్పష్టంగా కనిపించడంతో పాటు నొప్పి తీవ్రంగా ఉంటుంది. నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ సంబంధిత భాగాలు తిమ్మిరి పట్టడం, పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందంగా మారడం, గొంతు కండరాలు బిగుసుకుపో వడం జరుగుతాయి. కొందరిలో కళ్లు మగతగా మారి స్పృహ కోల్పోతారు. ఘటన జరిగిన 15 నిమిషాల్లో ఆస్పత్రికి తీసుకెళ్తే ముప్పు నుంచి తప్పించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

పొలంగట్ల మీద నడిచేటప్పుడు కర్రతో చప్పుడు చేస్తూ నడవడం మంచిది. రాత్రి వేళ వెళ్తే

మిగతా 6వ పేజీలో...

మూడేళ్లలో 71 పాము కాట్లు

జిల్లాలో ఏటా పాము కాటు కేసులు నమోదవుతు న్నాయి. వీరిలో రైతులే ఎక్కు వగా ఉంటున్నారు. గడిచిన మూడేళ్లలో అధికారికంగా 71 పాము కేసులు నమోద య్యాయి. గతేడాది కంటే ఈ సంవత్సరం పాము కాటు కేసులు అధికంగా ఉన్నాయి. ఎని మిది మందికి యాంటీ స్నేక్ వీనమ్ వ్యాక్సిన్ వేశారు.

వెంటనే ఆసుపత్రికి రావాలి..



జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో ఏఎస్‌వీ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. బాధి తులు సకాలంలో ఆసుపత్రికి తీసు కొస్తే వెంటనే చికిత్స అందిస్తారు. చాలామంది ప్రాథమిక జాగ్రత్తలు తీసుకోకపోవడం, పాము కాటే సిన చాలా సమయం తర్వాత ఆసుపత్రికి తీసుకురావడంతో పరిస్థితి విషమిస్తుంది. పాము కరవగానే భయాందోళనకు గురికా కుండా ధైర్యంగా ఉండాలి. పామును గుర్తిస్తే చికిత్స మరింత సులభం అవు తుంది. నాటు వైద్యం, మంత్రాలను ఉప యోగించడం వల్ల ప్రయోజనం ఉండదు. సాధ్యమైనంత త్వరగా దగ్గరలోని ఆసుప త్రికి రోగిని నడిపించకుండా తీసుకెళ్లాలి.

- వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి


మహాసభలో మాట్లాడుతున్న స్వప్న

మధ్యాహ్న భోజన కార్మికులకు 10 వేల వేతనం ఇవ్వాలి

కడ్తాల్, సెప్టెంబరు 4(ఆంధ్ర జ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికు లకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. కడ్తాల మండల కేంద్రంలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల మండల మహాసభ నిర్వహించారు. కార్యక్ర మానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు కార్మి కులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకో వాలన్నారు. ఆరు నెలల నుంచి గుడ్ల బిల్లులు, వేతనం అందక మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడు తున్నారని తెలిపారు. కార్మికుల న్యాయమైన సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని స్వప్న పేర్కొన్నారు. మహాసభలో సీఐ టీయూ మండల కన్వీనర్ పెంటయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా సహ కార్యదర్శి పద్మ, ఆమనగల్లు మండల అధ్యక్షురాలు రజియాబేగం పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

కడ్తాల మండల మధ్యాహ్న భోజన కార్మికుల నూతన కమిటీని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. మండల గౌర వాధ్యక్షురాలుగా లక్ష్మమ్మ, అధ్యక్షురా లుగా బుజ్జమ్మ, ప్రధాన కార్యదర్శిగా వరలక్ష్మి, కోశాధికారిగా సువర్ణ, ఉపా ధ్యక్షులుగా బాలమణి, అలివేలు, సహాయ కార్యదర్శిగా బాలమణి, మంజుల, అమృతలు ఎన్నికయ్యారు.

చెరువుల్లోకి చేరని నీరు!

నెరవేరని అయ్యవారిపల్లి ఆనకట్ట లక్ష్యం

- వినియోగంలోకి వస్తే 100 ఎకరాలు సాగులోకి
- బీమారం ఆనకట్ట వద్ద పేరుకుపోయిన మట్టి
- పాటు కాలువలను పట్టించుకోని పాలకులు
- చెరువులు, కుంటల పరిస్థితి దయనీయం

షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సాగు నీటి వనరులు లేని షాద్‌నగర్ ప్రాంత ప్రజలు కేవలం వర్షాధార పంటలపై ఆధార పడి వ్యవ సాయ చేస్తుంటారు. దశాబ్దాల కింద రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నిర్మించిన ఆనకట్టలు ఏళ్ల తరబడి నిరా దరణకు గురికావడంతో భూములు సాగుకు దూరమవుతున్నాయి. మిషన్ కాకతీయలో చెరువుల పూడిక తీతలు తీసిన అధికారులు ఆనకట్టల గురించి పట్టించుకోలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కాలువలకు మరమ్మతులు చేసినా నీరు మాత్రం చెరువుల్లోకి చేరలేదు.


ఆనకట్ట నుంచి వృథాగా పోతున్న నీరు

లక్ష్యానికి దూరంగా అయ్యవారిపల్లి ఆనకట్ట...

అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో చిన్న నీటి పారుదల శాఖ మంత్రిగా పని చేసిన డాక్టర్ పి. శంకర్‌రావు వరద నీరు వృథాగా పోకుండా బీమారం ఆన కట్టకు పైభాగంలో అయ్యవారిపల్లి

మిగతా 6వ పేజీలో...

చెరువులోకి నీరు వచ్చేలా చేయాలి



వర్షపు నీరు వృథాగా పోకుండా నల్ల చెరువులోకి వచ్చేలా చర్యలు చేప ట్టాలి. అలాచేస్తే వంద ఎకరాల ఆయ కట్టు సాగులోకి వస్తుంది. నీరు వస్తుం దని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం

- భరత్‌రెడ్డి, రైతు, అయ్యవారిపల్లి

నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తుం దని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నంది గామ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి, నూతన భవన నిర్మాణం, మౌలికవసతుల ఏర్పాటుపై పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు, ఆయా పార్టీల నాయ కులతో ఎమ్మెల్యే గురువారం సమావేశం నిర్వ హించారు. పాఠశాల అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2 కోట్ల 20 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో అధికారులు రాములు, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, నాయకులు జంగ నర్సింలు, రామన్న, బాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, కొమ్ము క్రిష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, లింగం, యువసత్తా లక్ష్మణ్, ఎదిర శ్రీకాంత్, చంద్రశేఖర్, నర్సింలు, కావలి క్రిష్ణ పాల్గొన్నారు.

బ్రిడ్జిల నిర్మాణానికి రూ. 5.60కోట్లు మంజూరు

కొందుర్గు : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి పేర్కొన్నారు. మండల పరిధిలోని టేకులపల్లి, బైరంపల్లి, గంగన్నగూడ, తంగెళ్లపల్లి గ్రామాల లోని బ్రిడ్జి నిర్మాణాల కోసం గురువారం శంకు స్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ మండలానికి నూతనంగా మూడు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీ ఎస్ ద్వారా రూ.12లక్షలు మంజూరు చేయించి నట్లు వివరించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, మల్లేష్ గౌడ్, పాహిల్‌మాన్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

డీజే వాడితే కఠిన చర్యలు

- డీసీపీ సునీతారెడ్డి

యాచారం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని, శోభాయాత్ర సందర్భంగా డీజే వాడితే కఠిన చర్యలు తప్పవని మహే శ్వరం డీసీపీ సునీతారెడ్డి హెచ్చరించారు. గురువారం రాత్రి మండల పరిధిలోని నంది వనపర్తి, పిల్లిపల్లి గ్రామాలలో పర్యటించి వినాయక మండపాల్లో ఆమె పూజలు చేశారు. మండపాల నుంచి గణనాథులను తీసిన వెంటనే విద్యుత్ కనెక్షన్‌లను తొలగిం చాలని చెప్పారు. శోభాయాత్రలో తాగి నృత్యాలు చేయొద్దని సూచించారు. ఆమె వెంట ఇబ్రహీం పట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐలు ఏ.నందీశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, ఎస్సైలు మధు, సైదులు, వంశీ తదితరులున్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి



మాట్లాడుతున్న ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

● టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు

ఆమనగల్లు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ పనిచేస్తుందని ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు అన్నారు. సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు సాగాలని కోరారు. ఆమనగల్లులోని వేంకటనర్సింహ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఆమనగల్లు బ్లాక్‌స్థాయి సమావేశాన్ని బ్లాక్ అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి సైదులు, ఆహ్వాన కమిటీ చైర్మన్ సిల్వర్‌సురేశ్‌లు హాజరయ్యారు. సురేశ్ మాట్లాడుతూ ఈ నెల 26న కందుకూరులో రంగారెడ్డి జిల్లా మూడో మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ గణేశ్, జిల్లా కమిటీ సభ్యులు యూనుస్, కోట్ల వెంకటేశ్, నర్సింహ్మా, చంద్రశేఖర్, చంద్రశేఖర్, తిరుపతి, శేఖర్, శ్రీను, తిరపతయ్య, రాజు, యాదగిరి, హఫీజ్, జంగయ్య పాల్గొన్నారు.

బ్లాక్ స్థాయి సమన్వయ కమిటీ...

జిల్లా మహాసభలను విజయవంతం చేసేందుకు ఆమనగల్లు బ్లాక్ స్థాయి సమన్వయ కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యూనుస్, సభ్యులుగా డి. శంకర్, నర్సింహ, చంద్రశేఖర్, చాట్ల యాదగిరి, తిరుపతి, చంద్రకుమార్, మహేశ్‌లు ఎన్నికయ్యారు. వీరు మహాసభల పనులను పర్యవేక్షిస్తారు.

లైంగికదాడి కేసు.. నిందితుడికి 20ఏళ్ల జైలు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన అత్యాచారం, కిడ్నాప్ కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ మేడ్చల్ స్పెషల్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జడ్జి ఎన్.అమరావతి గురువారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అల్వాల్ పీఎస్ పరిధిలో కిడ్నాప్, అత్యాచారం కేసులో నిందితుడిని మేడ్చల్ స్పెషల్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన జడ్జి నిందితుడు అద్దాల నాని(23)కి 20ఏళ్ల జైలు, 20వేల జరిమానా విధించారన్నారు. అలాగే బాధితురాలికి రూ.2లక్షల పరిహారం చెల్లించాలని తీర్పిచ్చారని వివరించారు.

పార్కు స్థలాలకు రక్షణ కరువు

- పరిగిలో 29 పార్కు జాగల గుర్తింపు
- కూలిన ప్రహరీలు, తుప్పు పట్టిన గేట్లు
- దొంగలపాలైన గ్రిల్స్, స్టీల్ పైపులు
- స్థలాల పరిరక్షణను పట్టించుకోని మునిసిపల్ అధికారులు



పరిగి మైత్రీనగర్‌లో అలనా, పాలన కరువైన పట్టణ ప్రకృతి వనం



పట్టణంలో ఓ వార్డులో కూలిన పార్కు గోడలు

పరిగి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పరిగి మునిసిపాలిటీ పరిధి పార్కులకు రక్షణ కరువైంది. స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఉన్న పరిగి పట్టణం ఏటికేడు విస్తరిస్తోంది. పట్టణంలో కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. అయితే వెంచర్లలోని పార్కు స్థలాలకు ప్రహరీలు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం లేదు. 15 వార్డుల్లో ఐదారేళ్ల నుంచి వెలసిన కాలనీల్లో 29చోట్ల పార్కు స్థలాలను గుర్తించారు. వీటిలో మూడింటిలోనే మొక్కలు పెంచుతున్నారు. మొక్కలకు ఫెన్సింగ్ లేక పశువులు, మేకలు మేస్తున్నాయి. కొన్ని పార్కులకు పైపులతో ప్రహరీ, ఫెన్సింగ్‌లను ఏర్పాటు చేసినా అవి ధ్వంసమయ్యాయి. అధికారుల పర్యవేక్షణ లేక పార్కు జాగాలు కబ్జా అవుతున్నాయి. ప్రహరీలు కూలుతున్నాయి. ప్రహరీల పైపులు, గ్రిల్స్‌ను ఎత్తుకపోతున్నారు. పరిగిలోని తిరుమల, మైత్రీ వెంచర్లలోని పార్కుల్లో పైపులు, గ్రిల్స్ అపహరించారు. మున్సిపల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి వదిలేశారు. 29చోట్ల పార్కు స్థలాలున్నట్లు రికార్డుల్లో ఉన్నా పదిలోపు స్థలాలకు మాత్రమే ఫెన్సింగ్ వేశారు. మిగతా వాటికి ఏ రక్షణా లేదు. వెంచర్లు వేసిన సమయంలో అధికారులు తగిన చర్యలు తీసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి తగిన రక్షణ ఏర్పాట్లు చేస్తే పార్కు స్థలాలకు భద్రత ఉండేది. వెంచర్లలో పార్కు స్థలాలకు రక్షణ ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో అవి కబ్జాల పాలవుతున్నాయి. ఇప్పటికైనా వెంచర్ ప్లానింగ్‌లో వదిలిన ప్రకారం పార్కు స్థలాలకు ప్రహరీలు, ఫెన్సింగ్ వేసి పరిరక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పార్కు స్థలాలకు ఫెన్సిగ్ వేసేందుకు చర్యలు



పరిగి మునిసిపల్ పరిధిలో 29 చోట్ల పార్కు స్థలాలను గుర్తించాం. మూడు చోట్ల మొక్కలు పెంచుతున్నాం. మరో మూడు చోట్ల చదును చేశారం. పార్కు జాగాల గ్రిల్స్ పైపుల చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశాం, పార్కు స్థలాలన్నింటికీ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం

- వెంకటయ్య, మునిసిపల్ కమిషనర్,పరిగి

ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలి



అనురాగ్ యూనివర్సిటీ ఏఐ వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన, నైతికమైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగంపై దృష్టి సారించాలని సీఎస్ఐ సభ్యుడు కల్యాణ్ సర్వేపల్లి అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్ విభాగం విభాగం నిర్వహించిన వర్క్‌షాప్‌నకు గురువారం ఆయన హాజరై మాట్లాడారు. రాబోవు కాలంలో ఏఐ ప్రభావం సమాజంపై చాలా ఉంటుందన్నారు. మంచి సమాజ నిర్మాణం కోసం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను వినియోగించాలన్నారు. ఏఐలో నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. లక్ష్య ఆధారిత వ్యవస్థ నిర్మాణంలో ఏఐ ఏజెంట్ వినియోగించుకోవాలని తెలిపారు. వర్క్‌షాప్‌లో 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీన్‌లు విజయ్‌కుమార్, మల్లికార్జున్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా బాలాజీ



చేవెళ్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పరిధి దామరిగిద్ద యూపీఎస్ ఉపాధ్యాయుడు కె.బాలాజీ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డుకు ఎంపిక చేశారు. తోటి టీచర్లు, నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ ఉప సభాపతి హరీశ్వర్‌రెడ్డికి ఘన నివాళి



హరీశ్వర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహేశ్‌రెడ్డి, తదితరులు

పరిగి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ ఉప సభాపతి, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్‌రెడ్డి ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం పరిగిలోని బృందావన్ గార్డెన్‌లో నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ నాయకులు హరీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ద్వితీయ వర్ధంతి క్రియలను ఆయన తనయుడైన మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితుడు సిద్ధాంతి పార్థసారథి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చిన అభిమానులు, కార్యకర్తలు హరీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. రాజకీయ దురంధుడు, సీనియర్ నేత హరీశ్వర్‌రెడ్డి రాజకీయాల్లో అందరివాడిగా పేరుప్రతిష్ఠలు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. హరీశ్వర్‌రెడ్డి తన రాజకీయాల్లో 'కోపం' పదమే తెలియని నేతగా ముద్ర వేసుకున్నారని అన్నారు. నేటి నాయకులకు ఆయన స్ఫూర్తిదాయకమని కీర్తించారు. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండేవారిన్నారు. కష్టాల్లో తానున్నానని వెన్నుతట్టి నిలిచిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో అన్ని మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు



క్రీడాకారులకు బహుమతులిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించే వారికి స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. ఎదులాబాద్ జెడ్పీ పాఠశాలలో జరిగిన జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతాప్‌సింగారం పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. గురువారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు చదువు, క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు సునీత, కృష్ణమహరాజ్, సత్యనారాయణ, నాయకులు కుమార్, నర్సింహాగౌడ్, ముత్తయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఫెన్సర్లకు షట్లర్ జ్వాల చేయూత



క్రీడాకారులతో గుత్తా జ్వాల

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రతిభావంతులైన యువ ఫెన్సింగ్ క్రీడాకారులకు దిగ్గజ షట్లర్, తెలంగాణ ఫెన్సింగ్ సంఘం అధ్యక్షురాలు గుత్తా జ్వాల అండగా నిలిచారు. గురువారం మొయినాబాద్‌లోని తన నివాసంలో ఫెన్సింగ్ క్రీడాకారులకు ఉచితంగా స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. వీరు ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ క్యాడెట్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు. ఫెన్సింగ్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానని జ్వాల తెలిపింది. కార్యక్రమంలో రాష్ట్ర ఫెన్సింగ్ సంఘం కార్యదర్శి వై.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి సందీప్‌జాదవ్ పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది అభివృద్ధికి చర్యలు



మున్సిపల్ సిబ్బందికి రెయిన్ కోట్లను అందజేస్తున్న రాధికాగుప్తా

ఘట్‌కేసర్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సిబ్బంది అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థల) రాధికా గుప్తా అన్నారు. గురువారం ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందికి రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజేష్ అదనపు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజని, ఏఈ రాకేష్, మేనేజర్ సతీష్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

● కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోయి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లులోని శ్రీ లక్ష్మీగార్డెన్‌లో గురువారం మున్సిపాలిటీ, మండల కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులు, కార్యకర్తలు తమ అభిప్రాయాలను ఎమ్మెల్యేకు తెలియపర్చారు. పార్టీ కోసం పనిచేసే వారికే పార్టీ, నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు ఇవ్వాలని, స్థానికంగా పార్టీ నాయకత్వాన్ని మార్చాలని, గెలిచే వారికే టికెట్లు ఇవ్వాలని, కార్యకర్తల మనోభావాలను గౌరవించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కంకణబద్ధులు కావాలన్నారు. అసత్య ప్రచారం, అబద్ధ పునాదులపై రాజకీయాలు సాగించేవారు ఎక్కువ కాలం మనలేరన్నారు. పార్టీ నిబంధనల ప్రకారం కార్యకర్తలు నడుచుకోవాలన్నారు. ప్రజాభిమానం ఉన్న వారికే స్థానిక ఎన్నికల్లో పార్టీ అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. ఆమనగల్లులో డివిజన్ కార్యాలయాల ఏర్పాటు, జూనియర్ కళాశాల నిర్మాణం, జంగారెడ్డిపల్లి- చంద్రాయన్‌పల్లి బీటీ రోడ్డు వెడల్పు, పాత రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీకి రూ.15 కోట్లు మంజూరు చేయాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారని నారాయణరెడ్డి తెలిపారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల, మున్సిపల్ అధ్యక్షులు జగన్, మానయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, మాజీ ఎంపీపీలు ధనుంజయ్య, అనితవిజయ్, మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, నారాయణ, కల్లు రమణారెడ్డి, సత్యం, శ్రీను, దశరథం, అంజన్‌రెడ్డి, జి.శ్రీను, కాలె మల్లయ్య, కె.శ్రీధర్‌రెడ్డి, జంగయ్య, శ్రీశైలం జంగయ్య, శ్రీకాంత్, ఫరీద్, బాల్‌రెడ్డి, జంగారెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల అనంతరం విపక్షాలు కనుమరుగు

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం విపక్షాలు కనుమరుగేనని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజారంజక పాలనతో తమకు భవిష్యత్తు లేదనే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆమనగల్లు 5వ వార్డుకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గురువారం ఏఎంసీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి స్వాగతించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనాదక్షత, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో వస్పుల శేఖర్, గురవయ్య, అనిల్, రాజు, శివ, రాకేశ్, సా యి, యాదగిరి, ప్రశాంత్, చంద్రయ్య ఉన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

బీమాపై జీఎస్టీ తొలగింపుతో పాలసీదారులకు ఊరట

వికారాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీమా పాలసీ అందరికీ అవసరమని, బీమా పాలసీలపై జీఎస్టీని తొలగించడం పాలసీదారులకు ఊరట కలిగించనుందని లియాఫీ వికారాబాద్ ఎల్ఐసీ బ్రాంచ్ అధ్యక్షుడు కిచ్చన్నగారి వెంకట్‌రెడ్డి అన్నారు. జీవిత, ఆరోగ్య బీమా పాలసీలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తొలగింపు ప్రకటన పురస్కరించుకుని గురువారం ఎల్ఐసీ కార్యాలయంలో లియాఫీ ఆధ్వర్యంలో ఏజెంట్లు, పాలసీదారులు కార్యాలయం సిబ్బందితో కలిసి కేట్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జీవిత, ఆరోగ్య బీమాలపై జీఎస్టీ తొలగించడాన్ని స్వాగతిస్తూ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బీమా పాలసీలపై జీఎస్టీ తొలగింపు కోసం అవిశ్రాంతంగా కృషిచేసిన తమ నాయకుల సమష్టి కృషిఫలితమే ఈ విజయమన్నారు. జీఎస్టీకి వ్యతిరేకంగా నుంచి లియాఫీ-1964సంఘం పోరాటం చేసిందన్నారు. లియాఫీ జాతీయ నేతలు ఎస్‌వీ శ్రీనివాసచారి, సింగారపు శ్రీనివాస్, పూరి వెంకటేశం, బీఎస్‌చారిల ఆధ్వర్యంలో చేసిన అనేక పోరాటాలతోనే జీఎస్టీ తొలగింపు ప్రకటనొచ్చిందన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి విజయేందర్, కోశాధికారి పాండు, కన్వీనర్ కృష్ణకుమార్, విజయభాస్కర్‌రెడ్డి, కేఎస్ఎన్‌రెడ్డి, రాధాబాయి, భాగ్య, రమాదేవి, సంతోష, ప్రభులింగం, యాదయ్య, విక్రమ్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, అనంతరెడ్డి, దివాకర్, హరిచందర్ పాల్గొన్నారు.



జీఎస్టీ తొలగింపును హర్షిస్తూ అభివాదం చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు, సలహాదారులు



మురళీనగర్‌లో కూలీల సమస్యలు తెలుసుకుంటున్న బాల్‌రాజ్

'ఉపాధి' పని దినాలు పెంచాలి

కందుకూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలకు పనిదినాలను పెంచి, కూలిని సకాలంలో చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. గురువారం మురళీనగర్‌లో కూలీల సమస్యలను తెలుసుకున్నారు. బీజేపీ ప్రభుత్వం కూలీలకు పనిదినాలను తగ్గించిందని, చేసిన పనికి కూడా సకాలంలో డబ్బులు ఇవ్వడం లేదని అన్నారు. ప్రభుత్వాలు కార్మికచట్టాలను పటిష్టంగా అమలు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు యాదయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

జీఎస్టీపై కేంద్ర నిర్ణయం ప్రజలకు వరం

» వ్యాపారులను కలిసిన బీజేపీ నాయకులు



వ్యాపారులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను(జీఎస్టీ)పై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజలకు వరంగా మారనుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిలు అన్నారు. షాద్‌నగర్‌లోని వ్యాపారులను గురువారం నాయకులు కలిసి జీఎస్టీ తగ్గింపుతో తగ్గనున్న వస్తువుల ధరలు, వినియోగదారులకు కలిగే ప్రయోజనాలపై చర్చించారు. బీమాపై 18శాతం ఉన్న జీఎస్టీని పూర్తిగా తగ్గించడం ఊరటన్నారు. విద్యార్థులు కొనుగోలు చేసే వస్తువులపై జీఎస్టీని తగ్గించిందని తెలిపారు. అలాగే ఆరోగ్యం కోసం కొనుగోలు చేసే వస్తువులతో పాటు ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషన్లు, ఆటోమొబైల్ రంగంపై కూడ జీఎస్టీ తగ్గనుందని తెలిపారు. జీఎస్టీ తగ్గింపు గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కక్కునూరి వెంకటేష్ గుప్తా, టి.విజయ్‌కుమార్, ఎం.మురళి, విజయ పాల్గొన్నారు.

చెన్నారెడ్డిగూడలో తీజ్ ఉత్సవాలు



మంచాల, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధి చెన్నారెడ్డిగూడలో తీజ్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మూడు రోజులు నిర్వహించిన ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం చివరిరోజు మహిళలు మొలకలతో ఊరేగుతూ అమ్మవార్లకు సమర్పించారు. సంప్రదాయ నృత్యాలు అలరించాయి. వివిధ పార్టీల నాయకులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ పగడాల యాదయ్య, ప్యాక్స్ చైర్మన్ హన్మంతరెడ్డి, వెంకటేష్ యాదవ్, రమేష్, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరన్‌కోట్ సీసీఐలో ఉత్పత్తి ప్రారంభం

తాండూరు రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కరన్‌కోట్‌లో గల కేంద్ర ప్రభుత్వరంగ సిమెంటు (సీసీఐ)కర్మాగారంలో సిమెంటు ఉత్పత్తులు ప్రారంభమయ్యాయి. 15రోజులుగా ఈ కర్మాగారంలో సిమెంటు కోల్ మిల్లులో మరమ్మతులు చేశారు. కోల్ మిల్లులో బాల్ బేరింగులు దెబ్బతిన్నాయి. దీంతో మోటార్లకు మరమ్మతులు చేశారు. గురువారం నుంచి సిమెంటు ఉత్పత్తి ప్రారంభమైనట్లు కార్మికులు తెలిపారు. ఈ సీసీఐ కర్మాగారం 40సంవత్సరాల క్రితం నెలకొల్పడంతో యంత్రాలన్నీ దెబ్బతిన్నాయని, వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్టు కార్మికులు పేర్కొన్నారు. ఈ సంస్థను మరింత మెరుగుపర్చేందుకు రూ.70కోట్ల నిధులు మంజూరుచేస్తే ఉత్పత్తులకు ఇబ్బంది కలగదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైస్ మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు

కొడంగల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వ, ఇతర వాటిపై విజిలెన్స్, జిల్లా పౌరసరఫరాల అధికారులు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, మోహన్‌కృష్ణ, గణపతిరావులు గురువారం తనిఖీలు నిర్వహించారు. కొడంగల్‌లోని వేంకటేశ్వర, గురురాఘవేంద్ర, లక్ష్మీనర్సింహస్వామి రైస్ మిల్లులో ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం నిల్వ వివరాలను అడిగి తెలుసుకున్నారు.



జెండావిష్కరణలో నాయకులు, రైతులు

సమస్యలు పరిష్కరించమంటే అరెస్టులా?

మొయినాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తే అరెస్టులు చేస్తున్నారని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు సామమాదవరెడ్డి అన్నారు. గురువారం చిలుకూరులో కిసాన్ సంఘ్ సమావేశాన్ని నిర్విహించారు. ఆయన మాట్లాడుతూ.. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500బోనస్ ఇవ్వడం లేదని, రెండు లక్షల రుణమాఫీ అందరికీ చేయలేదని అన్నారు. వీటిపై ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.విఠల్‌రెడ్డిని అరెస్టు చేశారన్నారు. తమ సంఘం రైతుల సమస్యలపై పోడుతోందని అన్నారు. పార్టీలు వేరైనా రైతులంతా ఒక్కటేనన్నారు. గ్రామంలో భారతీయ కిసాన్‌సంఘ్ జెండాను ఆవిష్కరించారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కేశంపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి సత్తా చాటాలని, గడప గడపకూ పార్టీని తీసుకెళ్లాలని మండల ఎన్నికల కన్వీనర్ కంచుకోట మహేష్ పిలుపునిచ్చారు. నిర్దవెల్లిలో గురువారం ఇంటింటికీ జనజాగరణ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రజారంజక పాలన చేస్తోందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహయాదవ్, ఎస్సీ మోర్చా నాయకుడు లింగయ్య, నాయకులు తిరుపతి, కుమారస్వామి, మురళి, శేఖరప్ప, వజ్రలింగం, వెంకటయ్య, సాయి కుమార్, బాలస్వామి, శేఖర్, శ్రీశైలం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం తండ్లాట



కులకచర్ల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద రైతులు

రైతులకు సరిపడా అందని ఎరువు

షాద్‌నగర్/కులకచర్ల/ఆమనగల్లు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు పాట్లు పడుతున్నారు. పొద్దు పొడవకముందే ప్రాథమిక సహకార సంఘాలు, గ్రోమోర్ ఆగ్రో కేంద్రాలు, ఫెర్టిలైజర్ షాపుల వద్దకు చేరుకొని లైన్ కడుతున్నారు. వస్తున్న ఒకటీ అరా యూరియా లోడ్లు రైతులకు సరిపోవడం లేదు. ఒక్కో రైతుకు ఒకటి, రెండు బస్తాల చొప్పున ఇస్తూ పంపిస్తున్నారు. చాలా మంది రైతులు ఉత్తి చేతుల్తోనే ఇళ్లకు వెళ్తున్నారు. తమకు యూరియా ఇవ్వవలసిందేనని దుకాణదారులతో గొడవపడుతున్నారు. వచ్చిన స్టాకును టోకెన్లు ఇచ్చి పోలీసుల పర్యవేక్షణలో పంపిణీ చేస్తున్నారు. పంటలకు యూరియా వేసే అదును దాటిపోతోందని, ఇప్పుడు వేయకుంటే దిగుబడి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా పొందేందుకు రైతుల మధ్య తోపులాటలు, గొడవలు సైతం చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వం రైతులకు సరిపాడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. షాద్‌నగర్‌లోని కేశంపేట రోడ్డులో సొసైటీ వద్ద గురువారం ఉదయం యూరియా కోసం రైతులు బారులు తీరారు. గత నెల 28, 29వ తేదీల్లో యూరియా పంపిణీకి కొందరికి స్లిప్పులు ఇచ్చారు. కానీ ఇప్పటికీ యూరియా ఇవ్వడం లేదని రైతులు సిబ్బందిపై విరుచుకుపడ్డారు. తమకే ముందు ఇవ్వాలని వాగ్వాదానికి దిగారు. కాగా ప్రతీ రైతు బయోమెట్రిక్ తీసుకుంటుండడంతో యూరియా పంపిణీలో జాప్యం అవుతోందని సిబ్బంది తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లికి చెందిన మహిళా రైతు సుగుణ(65) పట్టణంలోని ఓ ఫర్టిలైజర్ షాపు వద్ద ఉదయం 5:30 నుంచి నిరీక్షించింది. కులకచర్లలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి 220 బస్తాల యూరియా వచ్చింది. పోలీసు భద్రత మధ్య ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. చాలా మంది ఉత్త చేతుల్తో వెనుదిరిగారు. వరి నాటి నెల దాటినా యూరియా చల్లలేదని రైతులు తెలిపారు. యూరియా సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని బీఆర్ఎస్ ఆమనగల్లు మునిసిపల్ అధ్యక్షుడు పత్యనాయక్ అన్నారు. యూరియా కోసం రైతులు నిత్యం వేదన పడుతున్నా ప్రభుత్వాల్లో చలనం లేదని మండిపడ్డారు. ఆమనగల్లులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు, రైతులు హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఆఫీసు చేరుకొని ధర్నా నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వస్పుల సాయిలు, పంతూనాయక్, నిరంజన్‌గౌడ్, నాగిళ్ల జగన్, మహేశ్, గణేశ్, యాదయ్య, గణేశ్, సోమ్లా, శ్రీకాంత్, దేవేందర్, కృష్ణవేని, లలిత, శివ, విమలమ్మ పాల్గొన్నారు.



షాద్‌నగర్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు



యూరియా ఇవ్వడం లేదని స్లిప్పులు చుపుతున్న అన్నదాతలు



ఆమనగల్లు : ధర్నాలో మాట్లాడుతున్న పత్యనాయక్

మెడికల్ కాలేజీతో ప్రజలకు మేలు

» వికారాబాద్ జిల్లా అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

» కేసీఆర్ పాలనలో రాష్ట్రం అధోగతి : పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కొడంగల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మెడికల్ కళాశాలలో సీట్ల కేటాయింపు ప్రారంభం కావడంతో వైద్య కళాశాల సిబ్బంది ఉండేందుకు ఎమ్మెల్యే, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, స్థానిక వైద్య సిబ్బంది, నాయకులతో కలిసి పరిశీలించారు. కొడంగల్ నర్సింగ్ కళాశాల విద్యార్థులతో మాట్లాడారు. మెడికల్ కళాశాల భవనం పూర్తయ్యేంత వరకే తరగతులు తాండూర్‌లో కొనసాగుతాయని తెలిపారు. కళాశాల వైద్యులు, సిబ్బంది కొడంగల్‌లోనే ఉంటూ విద్యాబోధన చేస్తారని తెలిపారు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో మెడికల్ సీట్ల కేటాయింపు జరుగుతోందని, రాష్ట్రస్థాయి ఎంపికలో కొడంగల్‌కు 50సీట్లు భర్తీ అవుతాయని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిని పరిశీలించి నిర్మాణ పనులపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. కొడంగల్‌లో 220 పడకల ఆసుపత్రి, తాండూర్ ఆస్పత్రితో కలిపి 600 పడకలతో మెడికల్ కాలేజీ కొనసాగుతుందన్నారు. పూడూరులో రూ.3వేల కోట్లతో నేవీ రాడార్ స్టేషన్‌ను సీఎం ప్రారంభించారని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు పరిగి మండలం రాకంచర్ల మీదుగా వెళ్తుందన్నారు. వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ సర్వే పూర్తికాగా పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం పనులకు భూసేకరణ చేపట్టామన్నారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ.. ఉస్మానియాకు అనుసంధానంగా కొడంగల్‌లో మెడికల్ కళాశాల కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రప్రియ, వైద్యులు సాకేత్, సిబ్బంది, నాయకులు నందారం ప్రశాంత్, కృష్ణంరాజు, ఆసిఫ్ ఖాన్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

ఏ విచారణకైనా సిద్ధం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తన పదేళ్ల పదవీ కాలంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ స్పష్టం చేశారు. ఈ విషయంలో తాను ఏ విచారణకైనా సిద్ధమేనని అన్నారు. గురువారం షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. తాము తమ పూర్వీకుల నుంచే ఆస్తిపరులమని, ఎమ్మెల్యే కాకముందే తమకు 100 ఎకరాల స్థలం ఉందన్నారు. తమ కుమారులు కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారాల ద్వారానే సంపాదించుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు తమపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాను ఎమ్మెల్యేగా పదేళ్లలో ప్రజల కోసమే పని చేశానని, ఎవరి వద్దా రూపాయి కూడా లంచం తీసుకోలేదన్నారు. అప్పుడూ, ఇప్పుడూ కూడా తన సంపాదన నెలకు రూ.54వేలు మాత్రమేనని చెప్పారు. తాను బ్యాంకు లోన్ తీసుకునే కారు కొన్నానని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఎంఎస్.నటరాజన్, గణేష్, శ్రీధర్‌రెడ్డి, హఫీజ్, రెడ్డి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీపీవో

పెద్దేముల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇళ్లు మంజూరైన వారు త్వరగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని డీపీవో జయసుధ అన్నారు. మంబాపూర్, చైతన్యనగర్ గ్రామాల్లో గురువారం పర్యటించి ఇందిరమ్మ ఇళ్లు, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఇళ్ల లబ్ధిదారులకు దశలను బట్టి నిధులు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. పారిశుధ్య పనులను నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రతన్‌సింగ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆనందం పాల్గొన్నారు.

చేయూత పింఛన్ల పెంపుపై ప్రత్యక్ష యుద్ధమే

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

కొత్తూర్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): చేయూత పింఛన్ల పెంపు కోసం రేవంత్ సర్కార్‌పై ప్రత్యక్ష యుద్ధం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులోని జేపీ దర్గా వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తుడుం కిరణ్ మాదిగ అధ్యక్షతన దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఉపేందర్ హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు దివ్యాంగులకు 6వేల పింఛన్, వృద్ధులు, వితంతవులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులతో పాటు, చేయూత పింఛన్లు రూ.4వేలకు పెంచుతామన్న హామీని విస్మరించారని దుయ్యబట్టారు. ఈ విషయంలో ప్రతిపక్ష పార్టీ నేతలు ప్రభుత్వంపై పోరాడటంలో విఫలమయ్యారని ఆరోపించారు. మందకృష్ణ ముందుకు వచ్చి పింఛన్ దారులకు మద్దతు పలికి పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. పోరాటంలో భాగంగానే ఈనెల 8న చలో కలెక్టరేట్, 12న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, 20న హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధం, 21నుంచి 26వరకు గ్రామపంచాయతీల ఎదుట ధర్నా, 27న రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల దిగ్బంధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ముసాయిపేట యాదగిరి, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, కోళ్ల శివ, రావుగాళ్ల బాబు, శంకర్‌రావు, పెంటనోళ్ల రవికుమార్, రవి, రమేష్, రామచంద్రయ్య, కృష్ణ, శివశంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పేరిట ఇసుక అక్రమ రవాణా



పొలాల్లో ఇసుక డంపులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనుల పేరుతో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. 20ట్రాక్టర్లకుపైగా మహంతీపూర్ నుంచి బొంరాస్‌పేట్, మెట్లకుం, బురాన్‌పూర్ గ్రామాలు, తండాలకు ఇసుక తరలిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ పద్మావతి స్పందిస్తూ ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. జిల్లాస్థాయి అధికారులు ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న తల్లోజు ఆచారి

ఆమనగల్లు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రజా విశ్వాసం కోల్పోయాయన్నారు. స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీలకు గుణపాఠం తప్పదన్నారు. ఆమనగల్లులోని బీజేపీ కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ బీఆర్ఎస్ నాయకుడు వస్పుల రవీందర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి ఆచారి కండువాలు కప్పారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. కేంద్ర పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకుపోవాలనికోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ, మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, నాయకులు చెన్నకేశవులు, కృష్ణయాదవ్, పద్మప్రశాంత్, రవిరాథోడ్, చెక్కాల లక్ష్మణ్, సాయికుమార్, మహేశ్, రవీందర్, లక్ష్మణ్, శ్రీను, వంశీ, రాంకిరణ్, కార్తీక్, ఆనంద్, ప్రవీణ్, గణేశ్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను తనిఖీ చేసిన కమిషనర్

తాండూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ కమిషనర్ యాదగిరి శానిటేషన్ పనులను తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, జవాన్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు అప్రమత్తంగా ఉండాలని వర్షాభావం దృష్ట్యా తాండూరు పట్టణంలో మురుగు కాల్వలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వివిధ వార్డులో పర్యటించి ఆ వార్డులో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ప్రజలు ఏమైన సమస్యలు ఉంటే తాండూరు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు పుస్తకంలో నమోదు చేయాలని సూచించారు.

మోడల్ స్కూల్‌కు మంచి రోజులు



బషీరాబాద్‌లోని మోడల్ స్కూల్ హాస్టల్ భవనం

» బషీరాబాద్ ఆదర్శ పాఠశాలకు రూ.5లక్షలు మంజూరు

» హాస్టల్ అసంపూర్తి పనులకు మోక్షం

» త్వరలో అందుబాటులోకి భవనం



మోడల్ స్కూల్ పరిసరాల్లో చదును చేయిస్తున్న ప్రిన్సిపాల్ అనీల, లెక్చరర్లు

బషీరాబాద్ ,సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్‌లోని మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల)విద్యార్థులకు మంచి రోజులు రానున్నాయి. మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న హాస్టల్ భవనం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చొరవతో త్వరలోనే అందుబాటులోకి రానుంది. భవనంలోని అసంపూర్తి పనులకు ఎమ్మెల్యే రూ.5లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేయగా పనులు చేస్తున్నారు. 2016లో మోడల్ స్కూల్‌ను మంజూరైంది. పూర్తి సౌకర్యాలు లేకుండానే ప్రారంభించారు. 2019లో రూ.1.28కోట్లు మంజూరు కాగా స్కూల్ పక్కన హాస్టల్‌ను నిర్మించి 2022లో విద్యాశాఖకు అప్పగించారు. ఈ భవనం మూడేళ్లుగా వినియోగంలోకి రాలేదు. అసంపూర్తి పనులు, హాస్టల్ నిర్వహణకు సిబ్బందిని నియమించక నిరుపయోగంగా ఉంది. మోడల్ స్కూల్ విద్యార్థులకు హాస్టల్ లేక దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ స్కూల్‌లో 120మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా హాస్టల్ భవనాన్ని పట్టించుకోక తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. తాగునీరు, కరెంట్ సౌకర్యాలు కల్పించలేదు. భవనం చుట్టూ పొదలు పెరిగాయి.

ప్రిన్సిపాల్ ప్రత్యేక చొరవతో...

స్కూల్ ప్రిన్సిపాల్ అనీల బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి హాస్టల్ భవన పనులపై వినతిపత్రమిచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ హాస్టల్ భవన పనులకు పూర్తికి డీఎంఎఫ్‌టీ రూ.5లక్షల నిధులు మంజూరు చేయించారు. కాంట్రాక్టర్ హాస్టల్‌లో గదుల మరమ్మతులు, తలుపులు, కిటికీల కొత్తవి ఏర్పాట చేస్తున్నారు. కరెంట్, నీటి కనెక్షన్ కల్పించి భవనం ఖాళీ స్థలంలో ఫ్లోరింగ్ పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. భవన ప్రాంగణంలో పొదాలు, బండరాళ్లు తొలగింపు పనులు చేస్తున్నారు. నెల రోజుల్లో హాస్టల్‌ను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేలా ప్రిన్సిపాల్ పనులు చేయిస్తున్నారు.

లంబోదరుడికి పూజలు.. లడ్డూల వేలం


యాచారం : నందివనపర్తిలో భక్తులకు అన్నదానం చేస్తున్న బీఎన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి

నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వినాయక మండపాల వద్ద గురువారం ఉత్సవ కమిటీలు, నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. లడ్డూల వేలం, వినాయకుడి నిమజ్జనాలు చేపట్టారు. ఈమేరకు ఏకదంతుడిని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు దర్శించుకొని పూజలు చేశారు.


కడ్తాల : గణనాథుడి పూజలో నాయకులు, చిన్నారులు


షాబాద్ : మల్లారెడ్డిగూడలో రూ.2.1లక్షలకు లడ్డూ దక్కించుకున్న గోవర్ధన్‌రెడ్డి


జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాలలో నిమజ్జనోత్సవంలో బాలబాలికలు


కందుకూరు : కొత్తగూడలో రూ.లక్షా 2వేలకు లడ్డూ కైవసం చేసుకున్న అంజిరెడ్డి


శంకర్‌పల్లి : ప్రొద్దటూరులోని గణేశుడి వద్ద రూ.లక్షకు లడ్డూ దక్కించుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి



చేవెళ్ల : మల్కాపూర్, గుండాలలో లడ్డూను దక్కించుకున్న నాయకులు

షాద్‌నగర్ అర్బన్ : ఎంపీ శేషయ్యనగర్‌లో లడ్డూలను కైవసం చేసుకున్న పాతూరి బ్రహ్మయ్య, సత్య నారాయణ




ఆమనగల్లు : అన్నదాన కార్యక్రమంలో నాయకులు

సొంత పార్టీ నేతలపై విమర్శలను సహించం

- కాంగ్రెస్ మహేశ్వరం మండల అధ్యక్షుడు ఈశ్వర్ ముదిరాజ్
- పార్టీ నుంచి ఎడ్మ మోహన్‌రెడ్డి సస్పెండ్

మహేశ్వరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సొంత పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా సీఎం రేవంత్‌రెడ్డిపై కూడా సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టడంతో కాంగ్రెస్ పార్టీ నుంచి నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎడ్మ మోహన్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండలాధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ తెలిపారు. ఈమేరకు గురువారం తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో ఉంటూ సొంత పార్టీ నాయకులపై రోజుకో విధంగా సోషల్ మీడియాలో లేనిపోని పోస్టులు పెడుతూ పార్టీకి నష్టం చేసేలా వ్యాఖ్యలు చేస్తున్న మోహన్‌రెడ్డిపై పీసీసీ ఆదేశానుసారం సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇకనుంచి మోహన్‌రెడ్డికి పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. మళ్లీ కాంగ్రెస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేదిలేదని హెచ్చరించారు. మోహన్‌రెడ్డికి కాంగ్రెస్ కార్యక్రమాల గురించి ఎవరు సమాచారం ఇచ్చినా సహించేదిలేదన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, ఇంద్రకంటి నర్సింహ, సత్యనారాయణ, రాజునాయక్, పాండునాయక్, సమత తదితరులున్నారు.


సస్పెండ్ చేసినట్లు ధ్రువీకరణ పత్రాన్ని చూపిస్తున్న ఈశ్వర్ ముదిరాజ్

బస్సు సౌకర్యం కల్పించండి

- బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి

కొందుర్గు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తంగెళ్లపల్లి, విశ్వనాథ్‌పూర్, చేరుకుపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం షాద్‌నగర్ డీఎం ఉషను కలిసి ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందించారు. గ్రామాలకు బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయనతో శివారెడ్డి, రవి, ప్రకాశ్ ఉన్నారు.

'విష'మ కాలం!

(మూడో పేజీ తరువాయి)

టార్చిలైట్ తీసుకెళ్లాలి. ఇంటి చుట్టూ చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పాము కాటు బాధితులకు ధైర్యం కలల్పించాలి. భయంతో కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. కొందరు పాముకాటు వేయగానే కత్తి, బ్లేడుతో గాట్లు పెడుతుంటారు. అలా చేయకూడదు. గాయంపై భాగాన్ని వస్త్రంతో గట్టిగా కట్టి, కరిచిన చోట చిన్న గాటుతో విషం పిండి ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ఇళ్ల మధ్య ముళ్ల పొదలు పెరగకుండా తొలగించాలి. పాములకు ఆహారమైన ఎలుకలు, కప్పలు, తొండలు నివాసాల మధ్య చేరకుండా చూసుకోవాలి. పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు కాళ్లకు చెప్పులు, చీలమండల వరకు జీన్ ప్యాంటు ధరించాలి. లేదంటే మోకాలి దాకా శరీరాన్ని కప్పి ఉంచే గమ్ బూట్లు ధరించడం శ్రేయస్కరం.

పాము కాటు వేస్తే..

పాముల్లో తల త్రికోణాకారం ఉన్న పాములు మరింత విషపూరితం. వాటిలో నాగుపాము (కోబ్రా), కట్ల పాము (క్రైయిట్), పొడ లేదా పింజరి (వైపర్) ఈ జాతుల పాములు కాటు వేసిన వెంటనే ఆ ప్రాంతంలో సబ్బుతో కడిగి వెంటనే ఆస్పత్రికి తరలించాలి. మంత్రాలు, నాటు మందుల పేరిట జాప్యం చేస్తే ప్రాణాలకు హాని కలిగే అవకాశం ఉంటుంది. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో పాముకాటు విరుగుడు ఇంజక్షన్లు (యాంటీ వీనమ్) అందుబాటులో ఉన్నాయి. పాముకాటుకు గురికావొద్దు. అలా అయితే గుండెపోటు వచ్చే అవకాశం ఉంటుంది.

పిచ్చిమొక్కలతో ప్రభుత్వ కార్యాలయాలు..

జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ఎక్కడ చూసినా చెత్తా చెదారం, పిచ్చిమొక్కలతో కనిపిస్తున్నాయి. దీంతో పాములు సంచరిస్తున్నాయి. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ఆనుకుని ఉన్న పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఒకవైపు, మరో వైపు బీఎస్ఎన్ఎల్, దాని పక్కన ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వరకు పిచ్చిమొక్కలతో నిండి పోయింది. దీంతో ఆసుపత్రి ఆవరణం పరిశుభ్రంగా ఉన్నప్పటికీ ఇరువైపులా నిండి ఉన్న పిచ్చిమొక్కలతో పాములు ఆసుపత్రిలోకి వస్తున్నాయి. దీంతో రోగులు, వైద్య సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణంలో ఏపుగా పెరిగి పాములకు నెలవుగా మారిన పిచ్చిమొక్కలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు విషయంలో ప్రభుత్వ, స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ రిలే నిరహార దీక్షలను ఆమరణ నిరహార దీక్షలుగా మార్చడానికి నిర్ణయించినట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు. ఈమేరకు రిలే దీక్షలకు మద్దతుగా గురువారం గ్రామంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జేఏసీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువుల్లోకి చేరని నీరు!

(మూడో పేజీ తరువాయి)

శివారులోని నల్ల చెరువులోకి నీటిని మళ్లించడానికి సుమారు కోటి రూపాయలతో ఆనకట్టను నిర్మించారు. దాని కుడి కాలువ ద్వారా అయ్యవారిపల్లి శివారులోని నల్ల చెరువులోకి, ఎడమ కాలువ ద్వారా చించోడు శివారులోని బొమ్మ చెరువులోకి వరద నీరు మళ్లించాలని సంకల్పించారు. నల్ల చెరువు వరకు కాలువ నిర్మాణం జరిగినా చిన్న చిన్న సాంకేతిక లోపాల వల్ల నీరు మాత్రం నేటికీ చెరువులోకి చేరడం లేదు. మిషన్ కాకతీయలో కాలువ మరమ్మతులు చేసినా ప్రయోజనం కలుగలేదు. దాంతో గత 30 ఏళ్లుగా వరద నీరు వృథాగా సముద్రంలో కలుస్తుంది. నల్ల చెరువులోకి నీరు చేరితే 100 ఎకరాలు సాగులోకి వస్తుంది. అంతేకాకుండా భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది.

నిరాదరణకు గురైన బీమారం ఆనకట్ట

ఉమ్మడి కొందుర్గు మండలం వీరసముద్రం గ్రామ శివారులో పుట్టి రావిర్యాల, తంగెళ్లపల్లి, బీమారం, కాంసాన్‌పల్లి గ్రామాల మీదుగా బాలానగర్ మండలం సూరారం గ్రామాన్ని కలుపుతూ ఏడాది పాటు జీవ నదిగా ప్రవహించే వాగుపై నాటి నవాబులు భీమారం శివారులో అధునాతనంగా ఆనకట్టను నిర్మించారు. ఆనకట్టలో నిలిచిన నీరు సుమారు 200 ఎకరాలకు రెండు పంటలకు సాగు నీరు అందేది. ఏళ్ల తరబడి పూడిక తీయకపోవడం వల్ల నీటి నిల్వ భాగంలో మట్టి నిండి పోయింది. దాంతో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయింది. గతంలో తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో కొంతవరకు కాలువ మరమ్మతులు చేసినా ప్రస్తుతం సమస్య మొదటికి వచ్చింది. పూడిక నిండి పోవడం వల్ల ప్రతీ ఏడాది వర్షపు నీరు వృథాగా డిండి నదిలోకి పోతుంది. మిషన్ కాకతీయలో చెరువు మరమ్మతు, కాలువ మరమ్మతు కోసం రూ.23లక్షలు ఖర్చు చేశారు. కానీ మధ్యలో ఉన్న పైపుల లోపాన్ని సరి చేయలేదు.

కాలగర్భంలో కలుస్తున్న పాటు కాలువలు

చెరువు కుంటల పరిస్థితి అదే విధంగా ఉంది. చెరువుల్లోకి వర్షపు నీటిని తీసుకువచ్చే పాటు కాలువలు కాలగర్భంలో కలుస్తున్నాయి. రియల్ వ్యాపారం పుంజుకోవడం, భూముల ధరలు పెరగడంతో పాటు కాలువలు ధ్వంసమైనాయి. ఫరూఖ్‌నగర్ మండలంలో 7 ఆయకట్టు చెరువులతో పాటు 120కి పైగా కుంటలు ఉన్నాయి. వాటి పరిస్థితి కూడ దయనీయంగా ఉంది. కొన్ని చెరువులు కనుమరుగు కాగా, మరికొన్ని వర్షపు నీరు తీసుకువచ్చే పాటు కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. ఎలికట్ట శివారులోని లాడెం చెరువుకు అనుసంధానంగా ఉన్న పాటు కాలువ పూర్తిగా ఆక్రమణకు గురైంది. మధ్యలో పరిశ్రమలు ఏర్పడటం వల్ల కాలువ ఆనవాలు కనిపించడం లేదు. టీడీపీ ప్రభుత్వం హయాంలో సదరు పాటు కాలువకు ప్రభుత్వ నిధులతో మరమ్మతులు కూడ చేశారు. ఆక్రమణకు గురైన కాలువను విడిపించాలని గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం కలుగలేదు. మిషన్ కాకతీయలో పాటు కాలువలను గుర్తించకపోవడం వల్లే నేటి పరిస్థితికి కారణంగా చెప్పుకుంటున్నారు. కబ్జాల నుంచి పాటు కాలువలకు విముక్తి కల్పించాలని రైతులు కోరుతున్నారు.

సాంకేతిక లోపాలను సరి చేయాలి



ప్రతిఏటా వర్షపు నీరు వృథాగా పోతుంది. చెరువులోకి నీరు తెచ్చేందుకు కాలువ తవ్వినా మధ్యలో పైపులు సరిగా వేయలేదు. దాంతో నీరు ముందుకు రావడం లేదు. లోపాన్ని సరి చేసి చెరువులోకి నీరు వచ్చేలా చేయాలి.

- కృష్ణాజీ, అయ్యవారిపల్లి గ్రామస్తుడు

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

తలకొండపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్‌లు అన్నారు. మండల కేంద్రానికి చెందిన బాలకిష్టయ్యకు ఎమ్మెల్యే నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైన రూ.30వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం బాధిత కుటుంబానికి అజీమ్, రవీందర్ యాదవ్‌లు అందజేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు వైద్యచికిత్సలకు రూ.10లక్షలు సాయమందిస్తున్నట్లు పేర్కొన్నారు. మల్లేశ్, యాదగిరి, గణేశ్, పెంటయ్య, వెంకటేశ్, శేఖర్, యాదయ్య, అంజయ్య, పురుషోత్తం, సురేశ్, కృష్ణ, మహేశ్, శశి, ఉపేందర్, తదితరులున్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలను విజయవంతం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న శేరిబాయి గణేశ్

కొత్తూర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడబ్ల్యూజేఎఫ్ 3వ జిల్లా మహాసభలను విజయవంతం చేసేందుకు జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలిరావాలని మహాసభ నిర్వహణ కమిటీ చైర్మన్ చిలవేరు సురేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షుడు శేరిబాయి గణేశ్, సహాయ కార్యదర్శి సైదులు పిలుపునిచ్చారు. కొత్తూర్ మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో గల హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా వద్ద గురువారం నిర్వహించిన షాద్‌నగర్ నియోజకవర్గ జర్నలిస్టుల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మహేశ్వరంలో ఈనెల 26న టీడబ్ల్యూజేఎఫ్ 3వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేసి అంచలంచెలుగా పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని, మహాసభలో చర్చకు వస్తాయన్నారు. భవిష్యత్తులో చేపట్టబోయే పోరాటాలకు మహాసభ వేదిక కాబోతుందన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఒక బలమైన సంఘాన్ని నిర్మించి, జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతీ జర్నలిస్టు పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని, మహాసభకు జర్నలిస్టులు భారీసంఖ్యలో హాజరై సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఫెడరేషన్ సంఘం నాయకులు, జర్నలిస్టులు జేపీ దర్గాను దర్శించి ప్రార్థనలు నిర్వహించారు. టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ఎండీ ఖాజాపాషా, సైదులు, లక్కాలకు రమేష్, ఆంజనేయులు, నర్సింహారెడ్డి, మన్సూర్ అలీఖాన్, రాఘవేందర్, రాజశేఖర్, నరేష్, జర్నలిస్టులు సంజీవకుమార్, మెహన్‌రెడ్డి, వేణుగోపాల్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్

కడ్తాల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్యపరిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. 20 నెలలైనా అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసగించిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్ నాయక్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీల అమలుపై నిలదీయాలని పిలుపునిచ్చారు. కడ్తాల మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ఎదుట గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ఆరుగ్యారంటీల అమలుకై నిరసన దీక్ష కార్యక్రమాన్ని మండలాధ్యక్షుడు దోనాదుల మహేశ్ ఆధ్వర్యంలో చేపట్టారు. హరిప్రసాద్, సాయిలాల్ నాయక్, భగీరథ్‌లు మాట్లాడుతూ హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. జిల్లా, మండల నాయకులు శ్రీశైలంగౌడ్, నింగ్యారి యాదగిరి, సిద్దిగారి కుమార్, రాజునాయక్, మల్లేశ్, రవి, సురేశ్, కరుణాకర్ రెడ్డి, మహేశ్, శివయ్య, విక్రమ్, వెంకటేశ్, శ్రీకాంత్, కళ్యాణ్‌నాయక్, తదితరులున్నారు.



దీక్షలో హరిప్రసాద్, మహేశ్, నాయకులు

ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులు

ఆమనగల్లు/ఆదిభట్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులు అని ఎంఈవో చంప్లానాయక్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం చుక్కాపూర్ ఉన్నత పాఠశాల టీచర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో ముఖ్యఅతిథిగా హాజరై పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఏమిరెడ్డి రంగారెడ్డి సమకూర్చిన జ్యూట్ బ్యాగులను అందజేశారు. హెచ్ఎం శ్రీనునాయక్, పాండు నాయక్, విశ్రాంత హెచ్ఎం రామనాథం, టీచర్లు పాల్గొన్నారు. శెట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో స్వపరిపాలన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంఈవో పాండు హాజరై బహుమతులు ప్రదానం చేశారు. గతంలో పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన టీచర్లు యాదగిరి, శివలింగం లను సన్మానించారు. ఉపాధ్యాయులతోనే ఉత్తమ సమాజం నిర్మించబడుతుందని ఆదిభట్ల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ రాజ్‌కుమార్ అన్నారు. ఆదిభట్ల ప్రాథమిక పాఠశాలలో టీచర్లను సన్మానించారు. హెచ్ఎం పరమేష్, టీచర్లు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రంగారెడ్డి

క్రైం కార్నర్

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

శంకర్‌పల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన దీపక్ చౌహాన్(21), అతడి భార్య అను 6 నెలల క్రితం బతుకుదెరువు నిమిత్తం శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరుకు వచ్చి ప్రగతి రిసార్టులో నివాసముంటున్నారు. దీపక్ చౌహాన్ స్విమ్మింగ్ పూల్ ఇన్‌చార్జిగా, అను కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో ఆర్థిక ఇబ్బందులతో దీపక్ చౌహాన్ మద్యానికి అలవాటు పడ్డాడు. గురువారం భార్య ఇంట్లో లేని సమయంలో చున్నీతో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి భార్య అను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు మోకిల సీఐ వీరబాబు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

శంకర్‌పల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మోకిల సీఐ వీరబాబు కథనం మేరకు.. ఖమ్మంకు చెందిన రమాచారి(35) 15 ఏళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం నగరంలోని బాలానగర్‌కు వచ్చాడు. పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మోకిలలోని ఓ బిల్డింగ్‌కు పెయింటింగ్ వేసేందుకు తన తమ్ముడు లక్ష్మణ్‌తో కలిసి వచ్చాడు. గురువారం ఉదయం రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతుండగా విజేత సూపర్ మార్కెట్ వద్ద వెనకాల నుంచి ట్రాక్టర్ రమాచారిని ఢీకొనగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అయితే, ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని ఆయన తెలిపారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

- 3 తులాల బంగారం,
- 22 తులాల వెండి, రూ.2వేలు అపహరణ

కేశంపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లోకి చొరబడి 3 తులాల బంగారం, 22 తులాల వెండి, రూ.2వేలు అపహరించిన ఘటన మండలంలోని అల్వాల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. సీఐ నరహరి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కమ్మేకార్ అంజలి తన భర్త పరమేశ్వర్‌లో పాటు ఇద్దరు పిల్లల్ని తీసుకొని అమ్మగారిల్లు కొందుర్గు మండలం ఉత్తరాసిపల్లికి బుధవారం ఉదయం వెళ్లింది. ఈక్రమంలో అంజలి వాళ్ల ఇంటితాళం పగులగొట్టి ఉండడంతో పక్కంటి సత్తాజీ ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. వారు ఇంటికి వచ్చి చూడగా.. చోరీ జరిగిందని గమనించారు. ఇంట్లో ఉన్న 3 తులాల బంగారు వస్తువులు, 22 తులాల వెండి గొలుసులు, రూ.2వేలు చోరీకి గురైనట్లు గుర్తించారు. అంజలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా కలిపిన నీళ్లు తాగి.. కాడెడ్లకు అస్వస్థత

- చికిత్స నిర్వహించగా ఒకటి కోలుకోగా.. మరొకటి మృత్యువాత

షాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): యూరియా కలిపిన నీళ్లు తాగి రెండు కాడెడ్లు అస్వస్థతకు గురికాగా.. చికిత్స అందిస్తుండగా.. ఒకటి కోలుకోగా, మరొకటి మృతిచెందిన ఘటన షాబాద్ పశువుల ఆసుపత్రిలో గురువారం చోటుచేసుకుంది. పశువైద్యాధికారి స్రవంతి తెలిపిన వివరాల మేరకు.. షాబాద్‌కు చెందిన దొండ్ర కృష్ణ తన పొలం వద్ద పంటపై పిచికారి కోసం 25 కిలోల యూరియాను నీళ్లలో కలిపి పెట్టుకున్నాడు. పక్కనే ఉన్న కాడెద్దులు యూరియా కలిపిన నీళ్లను తాగాయి. ఆ వెంటనే అవి అస్వస్థతకు గురికాగా.. షాబాద్ పశువుల ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స నిర్వహించగా ఒకటి కోలుకోగా.. మరొకటి మృతిచెందింది. తన కళ్ల ముందే ఎద్దు మృతిచెందడంతో రైతు కృష్ణ బోరున విలపించాడు.

డీజే నిర్వాహకులపై కేసు

- వాహనం సీజ్ చేసిన పోలీసులు

యాచారం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా డీజే వాడి శబ్ద కాలుష్యం సృష్టించడంతో పాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించిన వారిపై కేసు నమోదుచేసి డీజేతో పాటు వాహనాన్ని సీజ్ చేశామని ఎస్సై మధు తెలిపారు. బుధవారం రాత్రి మొగ్గుళ్లవంపు గ్రామంలో హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు గణేష్ నిమజ్జనం కోసం పోలీసుల అనుమతి లేకుండా డీజే సౌండ్ హైవాల్యూమ్ పెట్టి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించడంతో పాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. ఈమేరకు బండ శ్రీనివాస్‌రెడ్డి, గొరారం లింగారెడ్డి, నందీశ్వర్ రెడ్డి, రేసు రాము, పట్నణ చంద్రశేఖర్‌రెడ్డి, మూడేళ్ల శ్యాంసుందర్, నాయిని వెంకటరెడ్డిలపై కేసులు నమోదు చేశామని, డీజేతో పాటు వాహనాన్ని సీజ్ చేశామని ఎస్సై తెలిపారు.

జీహెచ్ఎంయూ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్



మొయినాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం(జీహెచ్ఎంయూ) మొయినాబాద్ మండలాధ్యక్షుడిగా కేతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు జీ.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గురువారం మొయినాబాద్‌లో ఎంఈవో మల్లయ్య సమక్షంలో గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సమావేశం జరిగింది. నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షునిగా జీ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తోలుకట్ట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంపీవో మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృసిచేస్తామని తెలిపారు.

ట్రిపుల్ ఆర్‌తో అన్యాయం చేయొద్దు

ఆమనగల్లు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సాగు చేసుకుంటున్న భూముల మీదుగా ట్రిపుల్‌ఆర్ నిర్మించి తమకు అన్యాయం చేయవద్దని మాడ్గుల మండలం అన్నెబోయిన్‌పల్లి రైతులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కోరారు. రియల్టర్లు, బడా రైతుల కోసం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చి తమను రోడ్డు పాల్జేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణం చేపట్టకుండా మార్చడం వల్ల తమకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న, సన్న కారు రైతుల భూములే ఎక్కువగా కోల్పోవడం జరుగుతుందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అన్యాయం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

ఆమనగల్లు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అధైర్యపడవద్దు అండగా ఉంటామని ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జక్కు అనంత రెడ్డి అన్నారు. మంగళపల్లిలో గురువారం అనంతరెడ్డి పర్యటించారు. రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన శేఖర్ కుటుంబాన్ని పరామర్శించి రూ.4వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయనతో మాజీ సర్పంచ్ జంగయ్య, నాయకులు కృష్ణయ్యగౌడ్, కొండల్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, గోపాల్, నర్సింహ, గణేశ్, మల్లయ్య, తానయ్య, వినయ్, తదితరులు ఉన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న అనంతరెడ్డి

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

శంకర్‌పల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని యూత్ కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు మోత్కుపల్లి షైపాల్ తెలిపారు. కొండాకల్‌లోని జీడ్పీహెచ్ఎస్ టెన్త్ విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్ అందజేశారు. హెచ్ఎం జీవనజ్యోతి, టీచర్లు ఉన్నారు.


మెటీరియల్ అందిస్తున్న షైపాల్